క్లుప్తంగా

మద్యం మత్తులో ఆటోడ్రైవర్‌పై దాడి



ఒంగోలు టౌన్: మద్యం మత్తులో కొందరు కలిసి ఒక ఆటో డ్రైవర్‌పై దాడిచేసిన ఘటన గురువారం ఒంగోలు నగరంలో జరిగింది. స్థానిక సంతపేట సుబ్బమ్మ బజారుకు చెందిన కాల్వ గోపి ఆటో నడుపుకుంటూ జీవిస్తున్నాడు. గురువారం సాయంత్రం స్థానిక 60 అడుగుల రోడ్డులో ఆటోను రోడ్డు పక్కన పెట్టి వెళ్లాడు. తిరిగి వచ్చేలోపు ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు ఆటోలో కూర్చుని మద్యం సేవిస్తున్నారు. వారిని ఆటో దిగమని చెప్పిన గోపిపై ట్యూబ్ లైట్‌తో దాడి చేశారు. గోపి వీపు, కాళ్లకు గాయాలవడంతో స్థానిక జీజీహెచ్‌కి తరలించారు.

నేడు ప్రసన్నాంజనేయ స్వామి తిరునాళ్లు

నాగులుప్పలపాడు: ఉప్పుగుండూరు గ్రామంలో స్వయంభువుగా వెలసిన ప్రసన్నాంజనేయ స్వామి 39వ వార్షిక తిరునాళ్లను శుక్రవారం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం నుంచి స్వామి వారికి ప్రత్యేకంగా పూజా కార్యక్రమలతో ప్రారంభం కానున్నట్లు తెలిపారు. తిరునాళ్ల సందర్భంగా వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

మహిళలకు మొల్లమాంబ ఆదర్శం



మొల్లమాంబకు నివాళులర్పిస్తున్న బీసీ సంఘ నాయకులు

ఒంగోలు వన్‌టౌన్: మొల్ల రామాయణాన్ని సులభరీతిలో అందించిన ఆతుకూరి మొల్లమాంబ మహిళలకు ఆదర్శమని బీసీ సంఘం నాయకులు పేర్కొనారు. గురుఆరం మొల్లమాంబ జయంతి కార్యక్రమాన్ని బీసీ సంఘం ఆధ్వర్యంలో ఒంగోలు కలెక్టరేట్ ఎదురుగా ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ కుమ్మరి శాలివాహన కులానికి చెందిన మొల్ల 16వ శాతాబ్దపు మొట్టమెదటి తెలుగు కవయిత్రి అని అన్నారు. వాల్మీకి రామాయణాన్ని తెలుగులో సరళంగా అందరికి అర్థం అయ్యేలా అనువదించారన్నారు. కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు బొట్ల సుబ్బారావు, ఈవోడీఆర్ చావలి సుధాకర్, తాటిపర్తి వెంకటస్వామి, విశ్రాంత సంయుక్త కలెక్టర్ పేరయ్య, పేరం సత్యం తదితరులు పాల్గొన్నారు.

జయమ్మకు పార్టీ నాయకుల నివాళులు



కొత్తపట్నం: వైఎస్సార్ సీపీఈ నాయకుడు ఉద్దగిరి జాలయ్య భార్య జయమ్మకు నివాళులర్పించారు. గురువారం పెద్ద కర్మ సందర్భంగా ఎంపీపీ, మండల పార్టీ అధ్యక్షుడు లంకపోతు అంజిరెడ్డి, పార్టీ కార్యకర్తలు గురువారం జాలయ్య నివాసానికి వెళ్లి జయమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. పార్టీ అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో వజ్జిరెడ్డిపాలెం సర్పంచ్ బద్దేల జాలిరెడ్డి, పార్టీ కార్యకర్తలు వీరేపల్లి రామచంద్రారెడ్డి, రవికుమార్, తుళ్లూరి వెంకటనారాయణ, తాత నాంచార్లు, తాత శ్రీనివాసరావు, బలగాని బ్రహ్మయ్య పాల్గొన్నారు.

ఆదరణ పథకంపై అవగాహన

సంతనూతలపాడు: ప్రభుత్వం అందిస్తున్న ఆదరణ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని వక్తలు పేర్కొన్నారు. మండల కేంద్రంలో నాయి బ్రాహ్మణ కాలలో ఆదరణ పథకంపై అవగాహన సదస్సును కమిటీ కన్వీనర్ కే నరసింహారావు ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ జెడ్పీటీసీ తన్నీరు శ్రీనివాసరావు మాట్లాడుతూ బీసీ వెల్ఫేర్ నుంచి సబ్సిడీ రుణాలే కాకుండా ఆదరణ పథకం ద్వారా వృత్తి విద్యలను పెంపొందించుకొనుటకు, జీవన భృతి పెంచుకోవడానికి ఆదరణ పథకం ఎంతో ఉపయోగకరం అని తెలియజేశారు. నాయీ బ్రాహ్మణులకు అవసరమైన సంగీత పరికరాలు, సెలూన్ కుర్చీలు, సంగీత పరికరాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల గౌరవ అధ్యక్షుడు గుంటూరు ప్రసాద్, ఐఐటీ ప్రొఫెసర్ రంగస్వామి, నాయీ బ్రాహ్మణులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో కూటమి విఫలం



చీమకుర్తిలో సమస్యలను అడిగి తెలుసుకుంటున్న చైతన్య యాత్ర బృందం



వాటర్ ఫిల్టర్ బెడ్ భవనాన్ని పరిశీలిస్తున్న సీపీఎం సభ్యుల బృందం

ఒంగోలు టౌన్: నగరంలోని సగం మందికి మంచి నీరు సరఫరా చేసే కొండమిట్ట వాటర్ ఫిల్టర్ బెడ్ స్థానంలో కొత్త ఫిల్టర్ బెడ్ ఏర్పాటు చేయాలని సీపీఎం నగర కార్యదర్శి చీకటి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ప్రజా చైతన్య యాత్రలలో భాగంగా గురువారం రాజపానగల్ రోడ్డు, గద్దల గుంట, మామిడిపాలెం, సీతారాంపురం, జకరయ్య కాలనీ, యానాది కాలనీ, కొండమిట్ట ప్రాంతాలలో పర్యటించి ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. కొండమిట్టలో వాటర్ ఫిల్టర్ బెడ్ శిథిలావస్థకు చేరుకోవడంతో ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ.. కొండమిట్ట వాటర్ ఫిల్టర్‌బెడ్‌ను ఏర్పాటు చేసి 57 ఏళ్లు పూర్తయ్యాయని, ప్రస్తుతం అది శిథిలావస్థకు చేరుకుందని తెలిపారు. స్లాబు, పిల్లర్‌లు పగిలిపోయి ఇనుము బయటకు వచ్చిందన్నారు. బిల్డింగు ఎప్పుడు కూలిపోతుందో తెలియని పరిస్థితి ఏర్పడిందని, భవనం ప్రమాదకర పరిస్థితిలో ఉందని చెప్పారు. తక్షణమే ఈ ఫిల్టర్ బెడ్‌కు మరమ్మతులు చేయాలని, కొత్త ఫిల్టర్ బెడ్ నిర్మాణానికి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పొరపాటున ఫిల్టర్ బెడ్ కూలిపోతే నగరంలోని ప్రజలకు మంచి నీరు సరఫరా చేయడం కష్టమైపోతుందని, ముందస్తు చర్యలు తీసుకోవాలని కోరారు. నగరంలోని నిరుపేదలకు టిడ్కో గృహాలను పూర్తి చేసి ఇవ్వాలని, మురుగు కాలువలలో పూడికలు తీసి దోమల బెడద లేకుండా చేయాలని డిమాండ్ చేశారు. యాత్రలో పార్టీ జిల్లా నాయకులు బి.రఘురాం, జి.రమేష్, తంబి శ్రీనివాసులు, షేక్ అమీర్, సయ్యద్ హుసేన్, సీహెచ్ వినోద్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

మైనంపాడు ఎస్సీ కాలనీలో సమస్యలు..

సంతనూతలపాడు: గ్రామ పంచాయతీ సరఫరా చేసే మంచినీటి కుళాయిల నుంచి నీరు సరిగా రావడం లేదని పైపులైనును మార్చి నీరు సరిగా వచ్చే విధంగా చూడాలని మైనంపాడు ఎస్సీ కాలనీవాసులు కోరారు. ప్రజా చైతన్య యాత్రలో భాగంగా సీపీఎం నిర్వహిస్తున్న ప్రజా చైతన్య యాత్ర బృందం రాత్రి మండలంలోని మైనంపాడు ఎస్సీ కాలనీలో పర్యటించింది .ఈ సందర్భంగా కాలనీవాసులు తాము ఎదుర్కొంటున్న పలు సమస్యలను బృందం దృష్టికి తీసుకువచ్చారు. ఉచిత విద్యుత్ వాడుకుంటున్న తమకు పాత కరెంట్ బిల్లులు ఎక్కువ వచ్చాయని వాటిని కట్టించుకుంటున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఆపార్టీ మండల కార్యదర్శి కిలారి పెద్దబ్బాయి, మండల కార్యదర్శి వర్గ సభ్యులు నెరుసుల వెంకటేశ్వర్లు, బంకా సుబ్బారావు, నాయకులు పాల్గొన్నారు.

మాల కళాకారులకు పథకాలు అందించాలి



మాట్లాడుతున్న జాతీయ మాలమహాసభ అధ్యక్షుడు వెంకట్రావు

- 16న మాలల సాంస్కృతిక కళాజాత

చీమకుర్తి/ఒంగోలు వన్‌టౌన్: ఈనెల 16న ఒంగోలులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కళా ఆడిటోరియంలో నిర్వహించే మాలల సాంస్కృతిక కళాజాతరను జయప్రదం చేయాలని మాల మహాసభ జాతీయ అధ్యక్షుడు మల్లెల వెంకట్రావు పిలుపునిచ్చారు. గురువారం చీమకుర్తిలోని చేనేత సొసైటీ ప్రాంగణంలో మాలల సంఘాల నాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మల్లెల వెంకట్రావు మాట్లాడుతూ రాష్ట్రంలో లక్ష మంది మాలల కుటుంబాలు హిందూ సంప్రదాయ కళలపై ఆధారపడి జీవిస్తున్నారన్నారు. వారందరికి ప్రభుత్వాల నుంచి ఎలాంటి ఆదరణ పథకాలు అందటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కళలపై ఆధారపడిన మాలలకు పెన్షన్‌లు, పక్కా గృహాలు, ఇతర సంక్షేమ పథకాలను అందించాలని డిమాండ్ చేశారు. ఈనెల 16న ఒంగోలులో నిర్వహించే కళాజాతరను జయప్రదం చేసేందుకు చీమకుర్తి మండలం నుంచి పెద్ద సంఖ్యలో మాలల సంఘాలకు చెందిన నాయకులు తరలిరావాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో దళిత సంఘాల ఐక్యవేదిక జాతీయ అధ్యక్షులు చప్పిడి వెంగళరావు, మాల మహాసభ సంఘాల నాయకులు దండేల కృష్ణ, వేమా బాలకోటి, మట్టిగుంట రామాంజనేయులు, వేమా చినకోటేశ్వరరావు, మేడికొండ మురళీమోహన్ స్థానికులు పాల్గొన్నారు.

నిబద్ధత గల నాయకుడు కోటయ్య



దర్శకుడు శంకరబాబును సత్కరిస్తున్న కుటుంబ సభ్యులు

సంతనూతలపాడు: యాభై ఏళ్ల పాటు ప్రజాసమస్యల పరిష్కారం కోసం నిరంతరం పనిచేసిన కామ్రేడ్ నూకతోటి కోటయ్య నిబద్ధ కమ్యూనిస్టు అని పలువురు కొనియాడారు. గురువారం పేర్నమిట్ట శాంతినగర్ నగర్ కాలనీలో నూకతోటి కోటయ్య 25వ వర్ధంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. తొలుత కామ్రేడ్ కోటయ్య స్థూపానికి పూలదండలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సీఎం మర్రి చెన్నారెడ్డి హయాంలో 150 పక్కా గృహాలు ఏర్పాటు చేసేందుకు ఎంతో పోరాటం చేసి శాంతినగర్ కాలనీని పేదల కోసం సాధించారన్నారు. ఈ సందర్భంగా నటుడు, దర్శకుడు ఎల్ శంకర్, రంగస్థల కళాకారుడు నూకతోటి జయబాబులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఒంగోలు సిటిజన్ ఫోరం ప్రతినిధి కొల్లా మధు, నూకతోటి శరత్‌బాబు, అడ్వకేట్ రవికుమార్, అడ్వకేట్ దాసరి కోటిలింగం, సుబ్బారావు, దాసరి చినబాబు, కేవీపీఎస్ జిల్లా గౌరవధ్యక్షుడు అట్లూరి రాఘవులు, అడ్వకేట్ రామసుబ్బారావు పాల్గొన్నారు.

దేశానికి గౌరవం తెచ్చిన అంబేడ్కర్



అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎస్సీ, ఎస్టీ రైల్వే ఎంప్లాయీస్ నాయకులు

ఒంగోలు టౌన్: దేశ ప్రజలందరికీ సమాన హక్కులను ప్రతిపాదిస్తూ రాజ్యాంగ రచన చేసిన బాబా సాహెబ్ అంబేడ్కర్ దేశానికి గర్వకారణంగా నిలిచారని అసోసియేషన్ సౌత్ సెంట్రల్ రైల్వే జోనల్ కార్యదర్శి గూటాల పాపారావు అన్నారు. ఆల్ ఇండియా ఎస్సీ, ఎస్టీ రైల్వే ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం నగరంలోని రైల్వే స్టేషన్ ముఖ ద్వారం వద్ద అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పాపారావు మాట్లాడుతూ.. సమాజంలోని అట్టడుగు వర్గాల ప్రజల అభ్యున్నతి కోసం అహర్నిషలు పాటు పడిన అంబేడ్కర్ స్ఫూర్తిని ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులు కొనసాగించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అసోసియేషన్ డివిజన్ ప్రెసిడెంట్ కంటే రమేష్, బ్రాంచ్ కార్యదర్శి గంగపట్నం శ్యామ్ కుమార్, కోశాధికారి సుందర్ నాయక్, సభ్యులు కోటేశ్వరరావు, రాంబాబు, దాసరి శ్రీకాంత్ రైల్వే కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రపంచ కిడ్నీ దినోత్సవం



ర్యాలీ నిర్వహిస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

మద్దిపాడు: ఫ్లోరిన్ రహిత నీరుతో కిడ్నీ వ్యాధులు దూరం చేయవచ్చని రిమ్స్ కళాశాల ప్రిన్సిపాల్ సుమిత్రదేవి తెలిపారు. మండల పరిధిలో వెల్లంపల్లి గ్రామంలో ప్రపంచ కిడ్నీ దినోత్సవ కార్యక్రమం రిమ్స్ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఫ్లోరిన్ రహిత నీరు తాగాలని సూచించారు. కళాశాల నర్సింగ్ తృతీయ సంవత్సర విద్యార్థులు రాజులమెట్టలో అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. కార్యక్రమం అధ్యాపకులు మారుతి వరలక్ష్మి, ఫాతిమా, ధనలక్ష్మి పాల్గొన్నారు.

1200 ఓటర్లు మించితే కొత్త పోలింగ్ స్టేషన్



తహసీల్దార్ల సమావేశంలో పాల్గొన్న ఈఆర్‌ఓ

చీమకుర్తి: ప్రస్తుతం ఉన్న పొలింగ్ బూత్‌లలో 800 నుంచి 1200 ఓటర్లకు మించి ఉంటే నూతన పోలింగ్ స్టేషన్‌ను ఏర్పాటు చేసేందుకు ఉన్నతాధికారుల నుంచి అనుమతి వచ్చినట్లు ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ వరకుమార్ తెలిపారు. గురువారం చీమకుర్తిలోని తహసీల్దార్ కార్యాలయంలో సంతనూతలపాడు నియోజకవర్గంలోని నాలుగు మండలాల రెవెన్యూ అధికారులు, రాజకీయ పార్టీల నాయకులు, సూపర్‌వైజర్‌లతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వరకుమార్ మాట్లాడుతూ ఓటర్ల జాబితాలోని ఓటర్లకు సంబంధిచిన తాజా సమాచారంతో సిద్ధం చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈనెలలో మూడో శనివారం నియోజకవర్గంలోని అన్ని రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. చీమకుర్తి, సంతనూతలపాడు తహసీల్దార్‌లు ఆర్.బ్రహ్మయ్య, ఆదిలక్ష్మితో పాటు పలువురు డీటీలు, పలు పార్టీల నాయకులు పాల్గొన్నారు.

బర్లీ రైతులను ఆదుకోవాలి

ఒంగోలు టౌన్: బర్లీ పొగాకును అడిగే నాథుడే లేకపోవడంతో రైతులు అల్లాడుతున్నారని పొగాకు బోర్డు మాజీ సభ్యుడు, సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా కన్వీనర్ చుండూరి రంగారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గత ఏడాది సిగరెట్ తయారీదారులు బర్లీ పొగాకు మంచి ధరలకు కొనుగోలు చేయడంతో ఈ ఏడాది అధికంగా సాగు చేశారన్నారు. గత ఏడాది క్వింటా రూ.15 వేలకు కొనుగోలు చేశారని, ఈ ఏడాది రూ.3 వేలకు కూడా కొనుగోలు చేయడం లేదన్నారు. సాగు సమయంలో ప్రోత్సహించిన వ్యాపారులు, మధ్య దళారులు ఇప్పుడు ధరలు లేవని రైతులను మానసికంగా దెబ్బతీసి తక్కువ ధరలకు అమ్ముకునేలా కుట్రలు చేస్తున్నారన్నారు. ప్రభుత్వాలు జోక్యం చేసుకొని గిట్టుబాటు ధరలు ఇప్పించాలని కోరారు.

ప్లాస్టిక్ వినియోగంతో పర్యావరణానికి ముప్పు




మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ కళ్యాణి

ఒంగోలు సిటీ: ప్లాస్టిక్ వినియోగం వల్ల ఆరోగ్యానికే కాకుండా పర్యావరణానికి తీవ్ర ముప్పు వాటిల్లుతుందని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డీ కళ్యాణి అన్నారు. గురువారం ఒంగోలులోని డీఎస్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ప్లాస్టిక్ నిషేధంపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. విద్యార్థులు తమ కళాశాలలో, పరిసర ప్రాంతాల్లో ఇళ్లల్లో ప్లాస్టిక్ ఉపయోగించరాదని సూచించారు. పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన భవిష్యత్‌ను నిర్మించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, పర్యావరణ పరిరక్షణలో తమ వంతు బాధ్యతగా ప్రభుత్వ విధి విధానాలను పాటించాలని పిలుపునిచ్చారు. ప్లాస్టిక్ సంచులకు ప్రత్యామ్నాయంగా గుడ్డ సంచులు, కాటన్ బ్యాగులు, కాగితపు సంచులను ఉపయోగించాలన్నారు. కార్యక్రమంలో 'స్వచ్ఛ ఆంధ్ర-స్వర్ణ ఆంధ్ర' కళాశాల అధికారులు శ్రీనివాసులు, మన్నే శ్రీనివాసులు, కే. వెంకటేశ్వర నాయక్, ఎం.సుధరాణి, కళాశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

నాగలక్ష్మి అమ్మవారికి సారె సమర్పణ



పల్లకి మోస్తున్న అర్చకులు, భక్తులు



అలంకరణలో అమ్మవారు

ఒంగోలు మెట్రో: స్థానిక సంతపేట షిరిడీ సాయి బాబా మందిరంలో ఉపాలయంగా ఉన్న నాగలక్ష్మి అమ్మవారికి గురువారం పసుపు, కుంకుమతో సారె సమర్పించారు. ఉదయం భక్తులచే పంచామృతాభిషేకం నిర్వహించారు. సాయంత్రం సాయి యువజన, మహిళా విభాగం ఆధ్వర్యంలో నాగలక్ష్మి అమ్మవారి పల్లకి సేవను వైభవంగా నిర్వహించారు. అనంతరం అమ్మవారికి సామూహిక కుంకుమ పూజ నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ కమిటీ చైర్మన్ అలహరి చంచలరావు, వేద పురోహితుడు మఠంపల్లి దక్షిణామూర్తి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు నిర్వహించారు.

శ్రీవారి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ

సంతనూతలపాడు: మండల కేంద్రంలో వేంచేసి ఉన్న శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. శ్రీవారి ప్రథమ వార్షిక బ్రహ్మోత్సవంలో భాగంగా ముందు రోజు నిర్వహించే అంకురార్పణ కార్యక్రమాన్ని ఆగమ పండితులు గురువారం సాయంత్రం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ అర్చకుడు పరాంకుశం ప్రసాద్ ఆచార్యులు, పి అజయ్‌బాబు ఆధ్వర్యంలో ప్రత్యేక అలంకరణలు, స్వామివారికి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. గుంటూరుకు చెందిన నల్లూరి జగదీష్ కుమార్, నలుగురు ఆగమ పండితుల బృందం ఆధ్వర్యంలో స్వామి వార్లకు సేనాధిపతి ఉత్సవం, మేధన పూజ, అంకురారోహణం, పుణ్యాహావాచనం తదితర ప్రత్యేక పూజలను నిర్వహించారు.

గణితశాస్త్రంలో 'పై' విలువకు ప్రత్యేక స్థానం

ఒంగోలు సిటీ: గణిత శాస్త్రంలో 'పై'3.14159 విలువకు ప్రత్యేక స్థానం ఉందని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కళ్యాణి పేర్కొన్నారు. గురువారం డీఎస్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలో గణితశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో అంతర్జాతీయ గణిత శాస్త్ర దినోత్సవం, పైడే నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ పై విలువలను గణిత శాస్త్రం, భౌతిక శాస్త్రం, ఇంజనీరింగ్, ఖగోళ శాస్త్రం, కంప్యూటింగ్ వంటి అనేక రంగాల్లో కీలక పాత్ర పోషిస్తుందని వివరించారు. గణిత విభాగం ఇన్‌చార్జి డాక్టర్ కే కేజియా ఇంజనీరింగ్, నిర్మాణ శాస్త్రం, వంతెనలు, భవనాలు, యంత్రాల రూపకల్పనలో 'పై' కీలక పాత్ర వహిస్తుందన్నారు. గణిత అధ్యాపకురాలు శ్రావణి సాంకేతిక, కంప్యూటింగ్, సూపర్ కంప్యూటర్లు, ఏఐ మోడల్స్ విలువను మరింత కచ్చితంగా లెక్కించేందుకు ఉపయోగిస్తారని వివరించారు. అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

అసంపూర్తి గృహాలకు అదనపు సాయం



సమీక్ష నిర్వహిస్తున్న డీఈ చెన్నరాయుడు, ఎంపీడీవో

సంతనూతలపాడు: అసంపూర్తిగా ఉన్న నిర్మాణాలకు అదనంగా ఆర్థిక సహాయం అందించాలని నిర్ణయించినట్లు నియోజకవర్గ హౌసింగ్ శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పీ చెన్నరాయుడు పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం గృహ నిర్మాణ శాఖపై ఎంపీడీవో డీ సురేష్‌బాబు అధ్యక్షతన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు ఆయన పలు సూచనలు ఇచ్చారు. 2019–24 కాలంలో బీసీ, ఎస్సీ, ఎస్టీలకు గృహాలు మంజూరై వివిధ దశల్లో ఉన్న నిర్మాణాలను గుర్తించాలన్నారు. ఎస్సీ, బీసీ లబ్ధిదారులకు రూ.50 వేలు, ఎస్టీ లబ్ధిదారులకు రూ.75 వేలు, అత్యంత వెనుకబడిన గిరిజనులకు రూ.1 లక్ష అదనపు ఆర్థిక సహాయం అందజేస్తున్నామన్నారు. పీఎంఏవై 1.0 ఇల్లు మంజూరై నిర్మాణంలో ఉన్న గృహాలకు అదనంగా ఆర్థిక సహాయం అందించి ఆ ఇళ్లను పూర్తి చేసేందుకు ప్రభుత్వం సంకల్పించినట్లు చెప్పారు. పీఎంఏవై (అర్బన్) బీఎల్సీ 1.0, పీఎంఏవై (గ్రామీణ్) 1.0, పీఎం జన్మన్ పథకాల కింద ఇప్పటికే గృహాలను మంజూరు చేసిన లబ్ధిదారులకు ఈ అదనపు ఆర్థిక సహాయం వర్తిస్తుందన్నారు. 2019–24 గృహాలను ఆయా ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలు నిర్మాణాలను చేసి వివిధ దశల్లో పెండింగ్ ఉన్నవారికి మాత్రమే రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ఈ నిధులను మంజూరు చేసినట్లు ఆయన వెల్లడించారు. ఈ మేరకు లబ్ధిదారుడు ఇంటి నిర్మాణం పూర్తి చేసుకోవడానికి తక్షణమే అవసరమైన చర్యలు తీసుకోవాలని హౌసింగ్ అధికారులను ఆదేశించారు. ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, వార్డు అడ్మిన్లు ఈ విషయాన్ని విస్తృతంగా ప్రచారం చేసి లబ్ధిదారులు త్వరగా ఇళ్ల నిర్మాణం పూర్తి చేసుకునేలా సమన్వయంతో కృషి చేయాలని ఎంపీడీవో సూచించారు. ఈ సమావేశంలో హౌసింగ్ శాఖ వర్క్ ఇన్స్పెక్టర్ నాగలక్ష్మి, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత ఆదర్శాలకు నిదర్శనం శ్రీనివాసులు



శ్రీనివాసులు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న విద్యావంతులు

ఒంగోలు మెట్రో: జిల్లాలోని మారుమూల పల్లె నుంచి ఢిల్లీలోని ప్రధానమంత్రి కార్యాలయం వరకు విశ్రాంత డీఆర్డీవోగా ప్రయాణం చేసిన జడ శ్రీనివాసులు ఎందరికో ఆదర్శమని సామాజికవేత్త సోము రంగారెడ్డి అన్నారు. గురువారం ఒంగోలు నగరం శ్రీనగర్ కాలనీలో డాక్టర్ మల్లవరపు రాజేశ్వరరావు భవనంలో జాసుడి సెంటర్ ఫర్ లిటరేచర్ అండ్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో శ్రీనివాసులు జయంతి కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రకాశం జిల్లాలోని మారుమూల పల్లె తిమ్మారెడ్డిపాలెంలో ఒక నిరుపేద కుటుంబంలో జన్మించిన శ్రీనివాసులు కూలినాలి చేసుకొని పట్టుదలతో ఉన్నత చదువులు చదివారన్నారు. కష్టపడి చదువుతూ సివిల్ సర్వీస్ ఎంపికయ్యారన్నారు. డిఫెన్స్, నేషనల్ టెక్నికల్ రీసెర్చ్ ఆర్గనైజేషన్‌లో ఉన్నత అధికారిగా దేశానికి విశేషమైన సేవలు అందించారన్నారు. ఈ సంస్థ ప్రధానిమంత్రి కార్యాలయంలో ఒక భాగంగా ఉండేదని పేర్కొన్నారు. కార్యక్రమంలో సాహితీ సంస్థ డైరెక్టర్ డాక్టర్ నూక తోటి రవికుమార్, న్యాయవాదులు ఆడే రామ సుబ్బారావు, అట్లూరి రాఘవులు, అసోసియేషన్ ఆఫ్ ప్రైవేట్ లెక్చరర్స్ అండ్ టీచర్స్ ప్రతినిధులు దారా మోహన్ రావు, అప్పిసెట్టి బ్రహ్మయ్య, నోసిన వెంకటేశ్వర్లు, శ్రీనిధి ఒకేషనల్ జూనియర్ కళాశాల కరస్పాండెంట్ వాయల విజయరత్నం పలువురు విద్యావంతులు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితాలో తప్పొప్పల సవరణ



రాజకీయ పార్టీల సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో లక్ష్మీప్రసన్న

ఒంగోలు సిటీ: నియోజకవర్గం ఓటర్ల జాబితా, సవరణలో బీఎల్వోలు అప్రమత్తంగా ఉండాలని ఆర్డీవో లక్ష్మీప్రసన్న పేర్కొనారు. గురువారం ఒంగోలు నియోజవర్గ ఓటర్ల జాబితా, పోలింగ్ కేంద్రాలపై పలు రాజకీయ పార్టీలతో ఆర్డీవో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పోలింగ్ బూతుల్లో సమస్యలు, ఓటర్ లిస్టులలో తప్పులు సరిచేయడం, పోలింగ్ బూతులలో సౌకర్యాలు, కొత్త పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, పొలిటికల్ పార్టీలు బీఎల్వోలను ఏర్పాటు చేసుకోవాలని కోరార. సలహాలు, సూచనలను పార్టీ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఏఓ కృష్ణారావు, ఒంగోలు మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ కొండయ్య, కొత్తపట్నం తహశీల్దారు మధుసూదన్‌రావు, ఒంగోలు డిటీ సలోమి, జిల్లా వైఎస్సార్ సీపీ ఎలక్షన్ సెల్ రెప్రజెంటివ్ దామరాజు క్రాంతికుమార్, టీడీపీ నుంచి స్వరూప్, కాంగ్రెస్ నుంచి రసూల్, సీపీఎం రమేష్, బీజేపీ బసినేపల్లి రాజశేఖర్, రాయపాటి అజయ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గోవింద నామాలతో గిరి ప్రదక్షిణ



గిరి ప్రదక్షిణలో పాల్గొన్న భక్తులు

ఒంగోలు మెట్రో: పౌర్ణమి సందర్భంగా స్కంధగిరి శ్రీగిరి గోవింద నామాలతో మార్మోగింది. గురువారం స్కంధగిరి శ్రీగిరి ప్రదక్షిణ సేవా కమిటీ వారి ఆధ్వర్యంలో శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వరస్వామిని దివ్య రథంపై ప్రదక్షిణలు చేశారు. ఉత్సవమూర్తులను పుష్పాలతో ఎంతో చక్కగా అలంకరించి గోవింద నామాలు, విష్ణునామాలు, విష్ణు సహస్ర నామాలతో మహిళా భక్తులు భక్తిశ్రద్ధలతో జయరాం సెంటర్‌లోని గోశాల వద్ద గోపూజ నిర్వహించారు. స్వామివారికి అష్టోత్తర పూజ నిర్వహించి అనంతరం గిరి ప్రదక్షిణకు బయలుదేరి కోర్టు సెంటర్, పెద్ద శివాలయం సెంటర్, శర్మ కాలేజ్ సెంటర్, గద్దలగుంట నగరంలోని పురవీధుల్లో కొండమీద శ్రీగిరి స్కంధగిరి కొండపైకి చేరుకొని అక్కడ ప్రత్యేక పూజలు చేశారు. పురోహితులచే భక్తులకు వేద ఆశీర్వచనం తీర్థ ప్రసాదాలు అందజేశారు. నిర్వాహకుడు రాఘవరెడ్డి మాట్లాడుతూ ఈ గిరి ప్రదక్షిణకు వందలాది మహిళ భక్తులు వచ్చి గోవింద నామాలతో ప్రదక్షిణ చేశారన్నారు.

రైలు కింద పడి బీహార్ వాసి ఆత్మహత్య

ఒంగోలు టౌన్: కుటుంబ కలహాల నేపథ్యంలో బీహార్ వాసి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే పోలీసుల కథనం ప్రకారం.. బీహార్ రాష్ట్రంలోని ఔరంగాబాద్‌కు చెందిన సంజీవ కుమార్ (25) కొద్దిరోజులుగా బాపట్ల జిల్లా అద్దంకిలో కుటుంబంతో కలిసి నివాసం ఉంటున్నాడు. ఒక ప్రైవేటు సంస్థలో డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. కుటుంబ కలహాల నేపథ్యంలో గురువారం రాత్రి 7 గంటలకు ఒంగోలు సమీపంలోని కొత్తపట్నం ఫ్లై ఓవర్ బ్రిడ్జిపై నెల్లూరు నుంచి విజయవాడ వెళ్తున్న నవజీవన్ ఎక్స్‌ప్రెస్ కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రైల్వే పోలీసులు ఒంగోలు జీజీహెచ్‌కి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.